## మాజీ ఎమ్మెల్యే ఆల ప్రత్యేక పూజలు



అన్నాసాగర్‌లో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

భూత్పూర్, నవంబర్ 22 : మండలంలోని అన్నాసాగర్‌లో నిర్వహించిన అయ్యప్ప పడిపూజలో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ప్రతిఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సురేందర్‌రెడ్డి, గోపాలకృష్ణ, గురుస్వామి, కరుణాకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

## విద్యార్థులను పరామర్శించిన ఎమ్మెల్యే



విద్యార్థులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్, నవంబర్ 22 : భోజనం వికటించి మహబూబ్‌నగర్ జనరల్ దవాఖానలో చికిత్స పొందుతుతున్న మాగనూరు పాఠశాల విద్యార్థులను శుక్రవారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించారు. ఇప్పటికే 13 మంది విద్యార్థులు డిశ్చార్జి అయ్యి వెళ్లిపోగా, ఇద్దరు చికిత్స పొందుతున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ అల్పాహారంలో పరుగులు వచ్చాయని కొందరు కావాలనే, పాఠశాలలో కలెక్టర్, ఇతర అధికారులతో కలిసి వంటగది, భోజనానికి వినియోగించే బియ్యం, పప్పు తదితర వంట సామగ్రిని పరిశీలించినట్లు తెలిపారు. ఒక్క విద్యార్థికి మాత్రమే పురుగులు రావడం జరిగిందన్నారు. ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## జాతీయస్థాయి పోటీల్లో సత్తాచాటాలి



జాతీయస్థాయి పోటీలకు ఎంకైన విద్యార్థులతో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

- ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్, నవంబర్ 22 : జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో సత్తా చాటాలని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సూచించారు. మక్తల్ మండలం కర్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ కోచ్ పీడీ రూప ఆధ్వర్యంలో ఈనెల 13 నుంచి 22వ తేదీ వరకు క్రీడాకారులకు ఖోఖో శిక్షణ ముగింపు కార్యక్రమానికి శుక్రవారం ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జాతీయస్థాయి ఖోఖో పోటీల్లో రాణించాలని సూచించారు. రాష్ట్ర జట్టుకు పీడీ రూప శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. అనంతరం 40మంది క్రీడాకారులకు దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం వెంకటయ్యగౌడ్, రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయుడు గోపాలం, మాజీ ఎంపీటీసీ వెంకటేశ్, మాజీ ఎంపీపీ చంద్రకాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

### ఫీల్డ్ అసిస్టెంట్, ఏపీవో సస్పెన్షన్

మరికల్, నవంబర్ 22 : మండలంలోని కన్మనూర్‌లో ఉపాధిహామీలో అవకతవకలు జరిగాయని గ్రామస్థుల ఫిర్యాదుతో ఫీల్డ్ అసిస్టెంట్, ఏపీవోను సస్పెండ్ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రమేశ్ విచారణ చేసి డీఆర్డీవో మొగులప్పకు నివేదిక అందించడంతో శుక్రవారం ఫీల్డ్ అసిస్టెంట్ మతీన్‌ను, మరికల్ ఏపీవో చంద్రశేఖర్‌ను తాత్కాలికంగా సస్పెండ్ చేసినట్లు డీఆర్డీవో మొగులప్ప తెలిపారు.

**బహిరంగ ప్రకటన**

తేది: 23-11-2024

ఇందుమూలముగా సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, నా క్లయింటు నీనారెడ్డి W/o సుదీప్‌రెడ్డి. R/o Villa No:12/A, విల్లాగ్రీన్, గండిపేట్ రంగారెడ్డి జిల్లా, గారి తరపున జారీ చేయు బహిరంగ ప్రకటన ఏమనగా, మహబూబ్‌నగర్ జిల్లా॥, రాజపూర్ మండలం అగ్రారంపోట్లపల్లి గ్రామ శివారులో గల భూమి సర్వే నెం.16, 17, 18, 19, 20, 21, 22, 23, 24, 29, 30 & 91/1P లో గల ప్లాట్లు నెంబర్లు 7, 16, 206, 224, 226 మొత్తం విస్తీర్ణం 1927 చ.గజములు గల ప్లాటుకు సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్ నెంబర్ 6677/2023, తేది: 23/05/2023 గలదు. ఇప్పుడు నా క్లయింటు వద్ద లభ్యముగా లేదు. ఇట్టి విషయమై తగు చర్య నిమిత్తం సంబంధిత పోలీసు వారికి దరఖాస్తు ఇవ్వగా Missing Certificate ఇచ్చియున్నారు. కావున తెలియజేయునది ఏమనగా, ఇట్టి ప్లాట్ల పై ఎవరికైన వ్యక్తులు, సంస్థలు, ఏజెన్సీలు, తదితరములు ఏమైనా అభ్యంతరాలు, హక్కులు, క్లెయిములు ఉన్నయెడల క్రింది చిరునామాలో (7) రోజులలో తమ అభ్యంతరాలను, హక్కులను తగు దస్తావేజులతో సంప్రదించగలరు. మరియు ఎవరికైన అట్టి దస్తావేజు దొరికినచో క్రింది చిరునామాలో ఇవ్వగలరు. భవిష్యత్తులో వచ్చు ఏదేని న్యాయపరమైన చిక్కులు, వివాదాలు నివారించుటకు ఇట్టి బహిరంగా ప్రకటన జారీ చేయనైనది.

శంకర్ నారాయణ ఝువార్, MBA, LLB.,
న్యాయవాది, చంద్రా గార్డెన్ కమాన్ దగ్గర, బాదేపల్లి
జడ్చర్ల - 509 301, మహబూబ్‌నగర్ జిల్లా.
ఫోన్ నెం. 98495 73451

### పత్తికి నిప్పంటించిన దుండగులు

దేవరకద్ర రూరల్ (కౌకుంట్ల), నవంబర్ 22 : కౌకుంట్ల మండల కేంద్రానికి చెందిన రాములు పత్తి పంటను సాగు చేశాడు. పండించిన పత్తిని తీసి ఇంటి సమీపంలో దాదాపు 150 క్వింటాళ్ల పత్తి భద్రపరిచాడు. గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు పత్తికి నిప్పు అంటించారు. మంటలను గమనించిన స్థానికులు ఆర్పేందుకు ప్రయత్నించగా, అప్పటికే 20క్వింటాళ్ల పత్తి కాలిపోయింది. ఈ విషయమై రైతు రాములు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

### గుట్కాప్యాకెట్ల పట్టివేత

నారాయణపేట, నవంబర్ 22 : పట్టణంలోని సరాఫ్‌బజార్‌లో అశోక్‌పసారికి చెందిన కిరాణం దుకాణంలో శుక్రవారం పోలీసులు దాడులు నిర్వహించి నిషేధించిన అంబర్‌జర్దా, గుట్కా ప్యాకెట్లను పట్టుకున్నారు. పట్టుబడిన గుట్కా ప్యాకెట్ల విలువ రూ.38,985 ఉంటుందని, అశోక్‌పసారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**WANTED**

★ హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899 / 9640468899.
NT-338964-All

**ప్రకటన**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/- Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748

# నాణ్యమైన భోజనం అందించాలి

- నారాయణపేట కలెక్టర్ సిక్తాపట్నాయక్



ప్రిన్సిపాల్‌తో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ సిక్తాపట్నాయక్



జానంపేటలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈవో ప్రవీణ్‌కుమార్

నారాయణపేట టౌన్, నవంబర్ 22 : పాఠశాలలు, వసతిగృహాల్లో విద్యార్థులకు నాణ్యత భోజనం అందించాలని కలెక్టర్ సిక్తాపట్నాయక్ ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని ఎర్రగుట్ట వద్ద ఉన్న బాలికల గురుకుల పాఠశాల, కస్తూర్బా పాఠశాల, సింగారం చౌరస్తా సమీపంలో ఉన్న బాలుర గురుకుల పాఠశాలలను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పాఠశాలలు, వసతి గృహాలకు సరఫరా చేసే బియ్యాన్ని పరిశీలించి బాగా లేకపోతే తిరిగి పంపించాలన్నారు. గుడ్లు, కూరగాయలు, ఇతర నిత్యవసర సరుకులు ఒకటికి రెండుసార్లు పరిశీలించిన తర్వాతే వాడాలన్నారు. వసతిగృహాల్లో మెస్‌కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, కేర్‌టేకర్లు అల్పాహారం, భోజనాన్ని ముందుగా రుచిచూసిన తర్వాతే వడ్డించాలన్నారు. ప్రతిపాఠశాల, వసతిగృహాల్లో అల్పాహారం, భోజనం, పాలు, పండ్లను పరిశీలించేందుకు అక్కడి స్టాఫ్‌ను నియమించి పూర్తిబాధ్యత వారికి అప్పగించాలన్నారు. వంట ఏజెన్సీల నిర్వాహకులు పరిశుభ్రత పాటించాలన్నారు. మాగనూర్ లాంటి ఘటన పునరావృతం కాకుండా ప్రతిఒక్కరూ ప్రత్యేకశ్రద్ధతో పనిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జీసీడీవో పద్మనళిని తదితరులు పాల్గొన్నారు.

***అదనపు కలెక్టర్ తనిఖీ..***

మక్తల్, నవంబర్ 22 : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్ అన్నారు. శుక్రవారం మక్తల్‌లోని సాంఘిక సంక్షేమ ఎస్సీ బాలికల వసతి గృహం, ఆనంద నిలయం, బీసీ బాలుర వసతిగృహం, బీసీ బాలికల కళాశాల వసతి గృహాన్ని అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతిగృహాల్లో పరిశుభ్రమైన వాతావరణంలో వంటలను చేసి విద్యార్థులకు అందించాలన్నారు.

***విద్యార్థులపై శ్రద్ధ చూపాలి..***

మూసాపేట, నవంబర్ 22 : విద్యార్థులపై ఉపాధ్యాయులు శ్రద్ధ చూపాలని డీఈవో ప్రవీణ్‌కుమార్ సూచించారు. మూసాపేట మండలంలోని జానంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం మధ్యాహ్నం తనిఖీ చేసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలపై ఆరా తీశారు.

***పాఠశాలల తనిఖీ..***

జడ్చర్ల, నవంబర్ 22 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలని మండల విద్యాశాఖ అధికారి మంజులాదేవి అన్నారు. శుక్రవారం గోప్లాపూర్ ప్రాథమిక పాఠశాలను ఆమె సందర్శించారు. మధ్యాహ్నం బాదేపల్లి (కొత్తబజారు)లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కేవీపీటీ, కేజీబీవీ పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

***మెనూ ప్రకారం భోజనం అందించాలి??***

హన్వాడ, నవంబర్ 22 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎంఈవో గోపాల్‌నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని యారోనిపల్లి ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనంతోపాటు పాఠశాల పరిసరాలను పరిశీలించారు. నాణ్యమైన భోజనం అందించాలన్నారు.

***నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవు***

ఊట్కూర్, నవంబర్ 22 : విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని, నాణ్యత ప్రమాణాలు లోపిస్తే వంట ఏజన్సీలను రద్దు చేస్తామని ఎంపీడీవో ధనుంజయగౌడ్, తాసీల్దార్ రవి హెచ్చరించారు. శుక్రవారం మండలకేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం వంటలను తనిఖీ చేశారు.

***మధ్యాహ్న భోజనం పరిశీలన..***

మక్తల్, నవంబర్ 22 : నాణ్యమైన భోజనం అందించాలని మండల విద్యాశాఖ అధికారి అనిల్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మక్తల్, కర్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, మండలంలోని భగవాన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

***గురుకుల పాఠశాల తనిఖీ***

దేవరకద్ర, నవంబర్ 22 : మండల కేంద్రంలోని మహాత్మాజ్యోతిరావుపూలే గురుకుల పాఠశాలను శుక్రవారం అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. మాగనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆహారం కలుషితమై విద్యార్థులు అస్వస్థతకు గురికావడంతో ఉన్నతాధికారుల ఆదేశానుసారం తాసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీవో శ్రీనివాసులు, ఎంఈవో బలరాం గురుకుల పాఠశాల ను తనిఖీ చేసి వంట సామగ్రిని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ శరత్‌నాయక్, ఉపాధ్యాయులు ఉన్నారు.

### రైతులకు వెంటనే బోనస్ చెల్లించాలి

మక్తల్, నవంబర్ 22 : ప్రభుత్వం ప్రకటించిన విధంగా రూ.500 బోనస్ వెంటనే ఇవ్వాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు భగవంతు డిమాండ్ చేశారు. శుక్రవారం అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం ఆధ్వర్యంలో మక్తల్‌లో వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. పెట్టుబడి కింద ఎకరానికి రూ.30వేల ఖర్చు వస్తుందని, స్వామినాథన్ సిఫారసు ప్రకారం క్వింటాకు రూ.5వేలు ధర నిర్ణయించి రైతులకు అందించలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోకపోతే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్)మాస్‌లైన్ జిల్లా నాయకుడు కిరణ్, ఏఐపీకేఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరెడ్డి, నాయకులు వెంకటేష్, రాజు, పీడీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాస్కర్, రమేశ్ తదితరులు ఉన్నారు.

### భూత్పూర్‌లో సదర్ వేడుకలు



మాట్లాడుతున్న లక్ష్మణ్‌యాదవ్

భూత్పూర్, నవంబర్ 22 : పట్టణంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో సదర్ ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో దున్నపోతులతో విన్యాసాలను ప్రదర్శించారు. కార్యక్రమానికి ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

### రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ధన్వాడ, నవంబర్ 22 : మండలంలోని కొండాపూర్ గిరిజన గురుకుల పాఠశాలలో మినీనెట్‌బాల్ అకాడమిలో చదువుతున్న గణేశ్, వంశీచంద్, సిద్ధూ, శివకుమార్, కిశోర్, సతీశ్ ఎంపికయ్యారు. ఈనెల 23 నుంచి 25 వరకు మహబుబాబాద్‌లో జరిగే అండర్17 ఎస్జీఎఫ్ క్రీడాపోటీల్లో రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికకావడం జరిగిందని స్పోర్ట్స్ అకాడమి చైర్మన్ రామ్మోన్‌గౌడ్ తెలిపారు. విద్యార్థులు ఉమ్మడి పాలమూరు జట్టుకు ఆడతారని తెలిపారు.

### పోలీసు పహారాలో కళాజాత ప్రదర్శన



పోలీసుల పహారాలో నిర్వహిస్తున్న కళాజాత ప్రదర్శన

దేవరకద్ర రూరల్ (చిన్న చింతకుంట), నవంబర్ 22 : ఈనెల 20వ తేదీన అడ్డాకుల మండలంలో ప్రజాపాలనపై కళాజాత బృందం ప్రచారం నిర్వహిస్తుండగా ప్రజలందరూ తిరగబడ్డారు. ప్రభుత్వం ఇచ్చన ఒక్క హామీ అమలు చేయలేదని, కళాజాతతో అబద్ధపు ప్రచారం చేస్తున్నారా అని తిరగబడ్డారు. ఈ సంఘటనను దృష్టిలో పెట్టుకుని శుక్రవారం చిన్నచింతకుంటలో పోలీసుల బందోబస్తుతో కళాజాత నిర్వహించారు.

## ఫార్మసిస్టులదే ముఖ్య భూమిక



ఫార్మసీ వారోత్సవాల్లో మాట్లాడుతున్న వీసీ శ్రీనివాస్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, నవంబర్ 22 : ఆరోగ్య పరిరక్షణలో ఫార్మసిస్టులదే ముఖ్య భూమిక అని పాలమూరు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ జీఎన్ శ్రీనివాస్ అన్నారు. 63వ జాతీయ ఫార్మసిస్టు వారోత్సవాలు-2024 ఫార్మసీ కళాశాల ఆడిటోరియంలో శుక్రవారం నిర్వహించారు. సమావేశానికి వీసీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఫార్మసీ పూర్తి చేసిన విద్యార్థులకు భవిష్యత్తులో మంచి అవకాశాలు ఉంటాయన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య డి.చెన్నప్ప మాట్లాడుతూ దేశ ఆర్థిక అభివృద్ధిలో ఫార్మారంగం కృషి ఎనలేనిదన్నారు. ముఖ్య వక్త కళ్యాణ్‌చక్రవర్తి మాట్లాడుతూ ఫార్మసీ విద్యార్థులు అంకుఠిత దీక్ష కలిగి ఉండాలన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

**పీయూ అభివృద్ధికి ప్రణాళికలు :**

పీయూ అభివృద్ధిలో భాగంగా అకాడమిక్ ఆక్టివిటీస్, మౌలిక సదుపాయాలపై డీటెయిల్ ప్రాజెక్టు రిపోర్టు సిద్ధం చేయాలని పీయూ వీసీ శ్రీనివాస్ సూచించారు. వర్సిటీ పరిపాలన భవనం సమావేశ మందిరంలో అకాడమిక్ ఆక్టివిటీస్ కమిటీ ఛైర్మన్‌గా భాస్కర్, కన్వీనర్‌గా రవీందర్, సభ్యులుగా సంధ్యారాణి, శ్రీధర్‌రెడ్డి, వెంకట రాఘవేందర్, మధు, ఆంజనేయులు, బలీక్ ఉద్దీన్‌ను నియమించారు.

**వాలీబాల్ ఎంపికలు..**

సౌత్‌జోన్ ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌లో పాల్గొనే వాలీబాల్ (మహిళలు-పురుషులు) జట్ల ఎంపికలు శుక్రవారం నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారులు డిసెంబర్ 12న కేరళ, చెన్నై యూనివర్సిటీల్లో జరిగే టోర్నమెంట్‌లలో పాల్గొంటారని పీయూ ఫిజికల్ డైరెక్టర్ డా.వై.శ్రీనివాసులు తెలిపారు.

## పోలీసుల ప్రతిష్టను పెంపొందించాలి

- నారాయణపేట ఎస్పీ యోగేశ్‌గౌతమ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ యోగేశ్‌గౌతమ్

నారాయణపేట, నవంబర్ 22 : పోలీసులు చేసే ప్రతి పనిని సమాజంలో ప్రతిఒక్కరూ గమనిస్తుంటారని, మంచి నడవడికతో పోలీసుల ప్రతిష్టను పెంపొందించాలని ఎస్పీ యోగేశ్‌గౌతమ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎస్పీ కార్యాలయం ఆవరణలో 9నెలలుగా శిక్షణ పూర్తి చేసుకొని వచ్చిన ట్రైనీ కానిస్టేబుళ్లతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీస్‌స్టేషన్‌లో ప్రతిఒక్కరూ అన్ని రకాల డ్యూటీలు చేయాల్సి ఉంటుందని, తమకు అప్పగించిన బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించాలన్నారు. ప్రజల రక్షణ మనబాధ్యతని, వారి హక్కులకు, ఆత్మగౌరవానికి భంగం కలగకుండా ప్రజలతో మంచి నడవడికను అలవాటు చేసుకోవాలన్నారు. అవినీతి ఆరోపణలు లేకుండా, ప్రలోభాలకు గురికాకుండా నీతినిజాయితీతో విధులు నిర్వహిస్తే ప్రజలు ఆదరిస్తారన్నారు. కార్యక్రమంలో ఎస్బీ సీఐ రాంలాల్, ఆఫీస్ సూపరింటెండెంట్ శంకర్‌లాల్, ఆర్ఎస్సై శివశంకర్, రాములు, 78 మంది శిక్షణ పొందిన కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

## సదర్ ఉత్సవాల్లో రాజకీయాలెందుకు?



మాట్లాడుతున్న యాదవ సంఘం నాయకులు

మహబూబ్‌నగర్ అర్బన్, నవంబర్ 22 : ఎనమిదేండ్లు సదర్ ఉత్సవాలను రాజకీయాలకతీతంగా వైభవంగా నిర్వహించామని, కాంగ్రెస్ ప్రభుత్వం నేడు రాజకీయ ప్లీనరీలా మార్చిందని యాదవ సంఘం అధ్యక్షుడు సాయిలు యాదవ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని న్యూటౌన్ బీఆర్‌ఎస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గురువారం జరిగిన సదర్ ఉత్సవాలను చూస్తుంటే యాదవ కులస్తులను అవమానించేలా కాంగ్రెస్ పార్టీ రాజకీయ ప్లీనరీలా కనిపించిందని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను సదర్ ఉత్సవాలకు హాజరు కాగా, ఆయన అభిమానులు ఎత్తుకొని స్టేజ్‌పైకి వెళ్తే ఓర్వలేక కాంగ్రెస్ నాయకులు తాగొచ్చాడంటూ అవమానిస్తారా అంటూ మండిపడ్డారు. పార్టీ మారి తప్పుడు మాటలు మాట్లాడడం సరికాదన్నారు. యాదవుల మధ్య చిచ్చుపెట్టేలా కాంగ్రెస్ వ్యవహరిస్తున్నదన్నారు. ఉత్సవాలకు పిలిచి అవమానించినందుకు యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు శాంతన్నయాదవ్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. యాదవ యువత అధ్యక్షుడు శివయాదవ్ మాట్లాడుతూ సదర్ ఉత్సవాల్లో రాజకీయాలు చేయడమేమిటని ప్రశ్నించారు. సమావేశంలో గొర్రెల కాపరుల సంఘం డైరెక్టర్ రాజగోపాల్, యాదవ సంఘం ఉపాధ్యక్షుడు రామకృష్ణయాదవ్, గణేశ్‌యాదవ్, రాఘవేందర్, శ్రీనివాస్‌యాదవ్, లక్ష్మీనారాయణయాదవ్, పర్వతాలు, వెంకటయ్యతదితరులు పాల్గొన్నారు.

### నేడు తీగల్‌పల్లికి ట్రైనీ ఐఏఎస్‌ల బృందం రాక

నవాబ్‌పేట, నవంబర్ 22 : మండలంలోని తీగల్‌పల్లిలో శనివారం నుంచి వారం రోజులపాటు ట్రైనీ ఐఏఎస్‌ల బృందం పర్యటించనున్నట్లు ఎంపీడీవో జయరామ్‌నాయక్ తెలిపారు. సివిల్ సర్వీస్ శిక్షణలో భాగంగా ట్రైనీలు శరణ్‌గోపీనాథ్, కుమార్‌శుభం, సౌమ్యామిశ్రా, విశాఖగుప్తా, అశుతోష్‌గుప్తా గ్రామంలో పర్యటించి స్థానిక పరిస్థితులు, ప్రజల జీవన విధానం, ప్రభుత్వ పథకాల అమలు తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారని తెలిపారు.

### సాఫ్ట్‌బాల్ పోటీలకు యన్మన్‌గండ్ల విద్యార్థులు

నవాబ్‌పేట, నవంబర్ 22 : మండలంలోని యన్మన్‌గండ్ల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు అండర్-14 సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు జీహెచ్‌ఎం వనజ, పీఈటీ మేరీపుష్ప తెలిపారు. 9వ తరగతికి చెందిన శివకుమార్, రాఘవేందర్, రగ్బీ పోటీలకు 7వ తరగతికి చెందిన నరేశ్ ఎంపికైనట్లు తెలిపారు.

### 24న అథ్లెటిక్స్ టోర్నీకి ఎంపికలు

మహబూబ్‌నగర్ అర్బన్, నవంబర్ 22 : జిల్లా కేంద్రంలోని స్టేడియం మైదానంలో ఈనెల 24వ తేదీన సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు అథ్లెటిక్ సంఘం కార్యదర్శి శరత్‌చంద్ర, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆనంద్ శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. సబ్ జూనియర్ విభాగంలో ఎంపికైన 8,9,12 ఏళ్లలోపు బాలబాలికలు డిసెంబర్ 1నుంచి మంచిర్యాల జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

***ఈవెంట్స్‌లో పాల్గొనే బాలబాలికలు..***

8ఏళ్లలోపువారు స్టాండింగ్ బ్రాడ్‌జంప్ ఈవెంట్స్‌లో 50, 300 మీటర్లు, 10ఏళ్లలోపువారు లాంగ్‌జంప్ ఈవెంట్స్‌లో 100, 300 మీటర్లు, 12ఏళ్లలోపువారు లాంగ్‌జంప్, షాట్‌పుట్ ఈవెంట్స్‌లో 100, 400, 600 మీటర్లలో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు బోనఫైడ్, ఆధార్‌కార్డుతో హాజరు కావాలని వెల్లడించారు. వివరాలకు 9492177535 ఫోన్‌నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

### కాంగ్రెస్ హామీలను అమలు చేయాలి



నిరాహార దీక్ష చేస్తున్న దివ్యాంగులు

మహబూబ్‌నగర్ అర్బన్, నవంబర్ 22 : కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగులకు రూ.6వేల పింఛన్ ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిందని, వెంటనే అమలు చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ కో-చైర్మన్ రాంబాబు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరాస్తాలో వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో ఒకరోజు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ దివ్యాంగులకు పింఛన్ రూ.6వేలకు పెంచుతామని హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి నేడు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే దివ్యాంగులకు ప్రకటించిన 11డిమాండ్ల సాధనకు ఈనెల 26వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద మహాధర్నా నిర్వహిస్తామని పిలుపునిచ్చారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరేందర్, నాయకులు శంకర్‌యాదవ్, శ్రీనివాసులు, జైపాల్‌రెడ్డి, బిచ్చానాయక్, సుజాత, రజిత, గోపమ్మ, పారిజాత తదితరులు పాల్గొన్నారు.

### ఎల్‌వోసీ అందజేత

మూసాపేట, నవంబర్ 22 : మూసాపేట మండలంలోని నిజాలాపూర్‌కు చెందిన నాగన్న ప్రభుత్వం నుంచి మంజూరైన ఎల్‌వోసీని శుక్రవారం ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అందజేశారు. నాగన్న వెన్నెముకకు సంబంధించిన వ్యాధితో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. శస్త్ర చికిత్సకోసం ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సీఎం సహాయనిధికి రెఫర్ చేశారు. దీంతో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.2.50లక్షలు మంజూరయ్యాయి. అందుకు సంబంధించిన పత్రాన్ని ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రాంచందర్, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

### కొనుగోలు కేంద్రంలో అక్రమాలు

బాలానగర్, నవంబర్ 22 : బాలానగర్ మండలం చిన్నరేవల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రంలో అక్రమాలు జరుగుతున్నాయని గ్రామానికి చెందిన రైతు వాడ్యాల రామచంద్రారెడ్డి ఆరోపించారు. ఈనెల 16వ తేదీన ధాన్యం కొనుగోలు కేంద్రంలో 553 క్వింటాళ్ల ధాన్యం విక్రయించానని, బస్తాకు 40.700 కిలోల చొప్పున తూకం వేస్తూ ఈనెల 18న కొనుగోలు కేంద్రం నిర్వాహకులు రసీదు ఇచ్చినట్లు తెలిపారు. మూడ్రోజుల తర్వాత రైస్‌మిల్లర్ తూకం వేస్తే ధాన్యం 500 కిలోలు తక్కువగా ఉందని, ఇందుకు డబ్బులు తక్కువగా తీసుకోవాలని ఏపీఎం నాగరాజు చెప్పినట్లు పేర్కొన్నారు. రైతులను మోసం చేస్తూ మిల్లర్లకు ఎక్కువ ధాన్యం ఇస్తున్నారని రైతు రామచంద్రారెడ్డి ఆరోపించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు నష్టం వాటిల్లుతోందని, తనకు న్యాయం చేయాలని శుక్రవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ధాన్యం కొనుగోలులో రైతులకు జరుగుతున్న అక్రమాలను అధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

### పేట డీఈవోగా గోవిందరాజులు

నారాయణపేట రూరల్, నవంబర్ 22 : పేట జిల్లా డీఈవోగా గోవిందరాజులును నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ద్వారా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న డీఈవో అబ్దుల్‌ఘనిని మాగనూర్ పాఠశాల ఫుడ్‌పాయిజన్ ఘటనలో గురువారం సస్పెన్షన్ చేశారు. అధికారులు శుక్రవారం ఆయనను వనపర్తి ఇన్‌చార్జి డీఈవోగా నియమించారు. దీంతో సస్పెన్షన్‌కు గురయ్యారా లేక బదిలీవేటు పడిందా అని ఉపాధ్యాయులు చర్చించుకొంటున్నారు.

### ఉపాధ్యాయుల సస్పెన్షన్‌ను ఎత్తివేయాలి

నారాయణపేట రూరల్, నవంబర్ 22 : మాగనూర్‌లో విద్యార్థులకు ఫుడ్‌పాయిజన్ అయిన ఘటనలో జీహెచ్‌ఎం, ఎంఈవో మురళీధర్‌రెడ్డి, ఇన్‌చార్జి హెచ్‌ఎం బాబుల్‌రెడ్డిలపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని జీహెచ్‌ఎంల సంఘం ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు.

***తపస్ ఆధ్వర్యంలో..***

తపస్ ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్న భోజన సమయంలో నల్లబ్యాడ్జీలతో జాజాపూర్, కోటకొండ, సింగారం తదితర పాఠశాలల్లో నిరసన తెలిపారు.

***మరికల్‌లో..***

మరికల్, నవంబర్ 22 : మాగనూర్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నభోజనం వికటించి విద్యార్థులు అస్వస్థతకు గురికావడంతో ఉపాధ్యాయులను సస్పెండ్ చేయ్యడం తగదని తపస్ మండల అధ్యక్షుడు సురేశ్, మండల ప్రధాన కార్యదర్శి శివశంకర్ అన్నారు. బాలికల ఉన్నత పాఠశాలలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

***నల్లబ్యాడ్జీలతో నిరసన..***

ధన్వాడ, నవంబర్ 22 : తపస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల సస్పెండ్ చేయడంతో మండల కేంద్రంలో బాలుర ఉన్నత పాఠశాలలో నల్లబ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు సురేశ్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలన్నారు.